కొత్త పింఛన్లకు మోక్షమెప్పుడో?

- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- కార్యాలయాల చుట్టూ అర్హుల ప్రదక్షిణలు
- సూపర్ సిక్స్ హామీ ఏమైందని నిట్టూర్పు

నియోజకవర్గంలో కొత్త పింఛన్ల కోసం అర్హులు	
రాయదుర్గం	2,150
కళ్యాణదుర్గం	2,080
ఉరవకొండ	2,020



గుమ్మఘట్ట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హత ఉంటే చాలు.. పార్టీలకతీతంగా అన్ని రకాల పింఛన్లు అందేవి. ఇళ్లవద్దకు వెళ్లి పింఛన్ నగదు పంపిణీ చేసేవారు. కూటమి సర్కారు ఏర్పాటైనప్పటి నుంచి నేటికీ కొత్త పింఛన్లు మంజూరు చేయలేదు. అర్హత ఉన్న అనేక మంది కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పట్టించుకునేవారు లేరు. సూపర్ సిక్స్ హామీ ఏమైంది బాబూ.. అంటూ నిరుపేదలు నిట్టూరుస్తున్నారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో 6,250 మంది పింఛన్లకు అర్హులు ఉన్నారు. వితంతువులు, వృద్ధులు, దివ్యాంగులు కొత్త పింఛన్లు ఎప్పుడు మంజూరు చేస్తారోనని ఎదురుచూస్తున్నారు. అర్హత ఉన్న పేదలకు నూతనంగా పింఛన్లు మంజూరు చేస్తామని సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి నేతలు ప్రకటించారు. అధికారంలోకొచ్చి నెలలు గడుస్తున్నా నేటికీ కార్యరూపం దాల్చలేదు.

పింఛన్ కోసం ఎదురుచూస్తున్నా..



ఏడాదిన్నర క్రితం నా భర్త గోవిందప్ప మృతిచెందాడు. ఎలాంటి జీవనాధారం లేదు. పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నా. సచివాలయం, ఎంపీడీఓ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా. కానీ కొత్త పింఛన్‌లు ప్రభుత్వం మంజూరు చేయడంలేదు. నిరుపేదలకు పింఛన్ వస్తే ఆసరాగా ఉంటుంది. – తిప్పమ్మ, వితంతువు, పూలకుంట గ్రామం

పింఛన్ మంజూరు కాలేదు



నా భర్త మారెన్న మరణంతో కుటుంబం దిక్కులేనిదైంది. పింఛన్ కోసం చాలా మార్లు దరఖాస్తు చేసుకున్నాం. కానీ పింఛన్ మంజూరు కాలేదు. భర్తను కోల్పోయి నిస్సహాయ స్థితిలో ఉన్న మాలాంటి అభాగ్యులకు ప్రభుత్వం కొత్త పింఛన్లు మంజూరు చేయాలి. – బోయ గంగమ్మ, వైద్యం గుండ్లపల్లి గ్రామం

అర్హులందరికీ పింఛన్లు ఇవ్వాలి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగనన్న అర్హత ఉంటే చాలు.. పార్టీలకతీతంగా పారదర్శకంగా పింఛన్లు మంజూరు చేశారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేయించాం. అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా కూటమి ప్రభుత్వం కొత్త పింఛన్లు మంజూరు చేయకపోవడం సరికాదు. ఎంతో మంది కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పార్టీలకతీతంగా పారదర్శకంగా పింఛన్లు మంజూరు చేయాలి. – మెట్టు గోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, రాయదుర్గం

క్లుప్తంగా

ఘనంగా మదర్స్ డే



శివరాంపేటలో మాట్లాడుతున్న సీడీపీఓ శ్రీదేవి

కూడేరు: మండలంలోని శివరాంపేట అంగన్‌వాడీ కేంద్రంలో 'మదర్స్ డే' వేడుకలను శనివారం నిర్వహించారు. సీడీపీఓ శ్రీదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పిల్లల చేత తల్లులకు మదర్స్ డే శుభాకాంక్షలు చెప్పించారు. సీడీపీఓ మాట్లాడుతూ అమ్మ లేకుంటే సృష్టి లేదన్నారు. అమ్మ రుణాన్ని ఎన్నటికీ తీర్చుకోలేనిదన్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ అరుణ, మహిళా పోలీసు ధనలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు శ్యామల, ఉషా, నాగలక్ష్మి, శాంతి, పుష్పావతి, చౌడమ్మ, కిశోర బాలికలు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం



వజ్రకరూరులో కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

వజ్రకరూరు: స్థానిక ప్రాథమిక పాఠశాలలో సర్పంచు మోనాలిసా ఆధ్వర్యంలో శాంతిరామ్ ఐ హాస్పిటల్ కర్నూల్ వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన కంటి వైద్యశిబిరానికి స్పందన లభించింది. మొత్తం 60 మందికి కంటి పరీక్షలు చేశారు. పలువురిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో చాబాల సర్పంచు మల్లెల జగదీష్, ఎంపీహెచ్ఈఓ గురుప్రసాద్, ఎంఆర్‌పీఎస్ నాయకులు బెంజిమెన్, తిరుపాల్, సామాజిక కార్యకర్త మల్లికార్జున, సీహెచ్ఓ లక్ష్మీదేవి, సూపర్‌వైజర్లు నాగ శంకర్, ఏఎన్ఎం సుకన్య, ఆశాకార్యకర్తలు ఆనందలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా హర్షలత



కళ్యాణదుర్గంరూరల్: పట్టణం లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా హర్షలత శనివారం బాధ్యతలు చేపట్టారు. అన్నమయ్య జిల్లాలోని రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసి అక్కడి నుంచి బదిలీపై కళ్యాణదుర్గం డిగ్రీ కళాశాలకు వచ్చారు.

వీర జవాన్‌కు నివాళి



చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

వజ్రకరూరు: వెంకటాంపల్లి పెద్దతండా (రూపా నాయక్ తండా)లో వీరజవాన్ మురళీ నాయక్‌కు శనివారం ఘన నివాళులర్పించారు. మురళీనాయక్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. సామాజిక కార్యకర్త నాగరాజునాయక్ మాట్లాడుతూ భారత్–పాకిస్తాన్ మధ్య జరుగుతున్న యుద్ధంలో మురళీనాయక్ వీరోచితంగా పోరాడి ప్రాణాలు కోల్పోయారన్నారు. దేశంకోసం ప్రాణాలు అర్పించిన గొప్ప యోధుడుగా మురళీనాయక్ చరిత్రలో నిలిచిపోతారన్నారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త నాగరాజునాయక్, ఉపసర్పంచు వెంకటేష్‌నాయక్, గిరిజన నాయకులు బాబునాయక్, లక్ష్మానాయక్, నెట్టె నాయక్, నారాయణనాయక్, విజయ్‌కుమార్ నాయక్, హర్షానాయక్ తదితరులు పాల్గొన్నారు.


కొవ్వొత్తులతో ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న బంజారా సేవా సంఘం ఉద్యోగులు

రాయదుర్గంటౌన్: పట్టణంలో బంజారా ఉద్యోగుల సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద నుంచి లక్ష్మీబజార్, అనంతపురం రహదారి, పాత బస్టాండ్ మీదుగా వినాయక సర్కిల్ వరకు ర్యాలీ చేశారు. అక్కడ వీర జవాన్ మురళీనాయక్ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు.

రక్షణ గోడ ఏదీ?



ఉరవకొండ మాలవీధిలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

ఉరవకొండ: స్థానిక 4 వార్డు మాలవీధిలోని కుమ్మరకుంట సమీపంలో ప్రధాన రోడ్డు పక్కనే ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నా విద్యుత్ సిబ్బంది పట్టించుకోవడంలేదు. వరుసగా మూడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ గోడ లేదు. ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్న చోట చిన్నారులు అక్కడే ఆడుకుంటుంటారు. గ్రామస్తులు కూడా అక్కడే కూర్చుంటున్నారు. ఆటోలు, ఎడ్లబండ్లు అక్కడే నిలుపుతున్నారు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం జరిగే అవకాశం ఉంది.

ప్రవక్త ప్రవచనాలు అనుసరణీయం



ఖురాన్ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న దృశ్యం

కణేకల్లు: మహమ్మద్ ప్రవక్త ప్రవచనాలు అనుసరణీయమని మొలకాల్మూరు మదరసా మౌలానా మునీరుద్దీన్‌సాబ్ తెలిపారు. శనివారం కణేకల్లులోని మక్తాబ్ తాలీముల్ ఖురాన్ దీనియాత్ స్కూల్‌లో జల్సా (వార్షికోత్సవం) జరిగింది. మౌలానా మునీరుద్దీన్‌సాబ్ ముస్లింలు మాట్లాడారు. ఆధ్యాత్మిక విద్య బోధనతో పిల్లలు సన్మార్గంలో నడుస్తారన్నారు. ప్రతి ఒక్కరితో సోదర భావంతో మెలగాలన్నారు. అనంతరం ఖురాన్ నాజిరా (పఠించడం) నేర్చుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్, ఖురాన్‌తోపాటు బహుమతులు అందించారు. ఆఖయిద్, అహదీస్, దువాయే, నమాజ్ తరికా నేర్చుకొన్న చిన్నారులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ముతవల్లీలు మస్తాన్, ఉసేన్‌సాబ్, హాఫీజ్‌లు రఫీక్, అబ్దుల్లా, మన్సూర్, అబ్దుల్‌హక్, కబరస్తాన్ కమిటీ అధ్యక్షులు బషీర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎరడికెరలో ఫ్యామిలీ ఫిజీషియన్



ఇంటి వద్దకే వెళ్లి వైద్యపరీక్షలు చేస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం : మండలంలోని ఎరడికెరలో డాక్టర్ రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. గ్రామంలో మంచానికి పరిమితమై రోగులకు ఇళ్ల వద్దకు వెళ్లి బీపీ, రక్తపరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందించారు. వేసవిలో వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం కవిత, ఆశా కార్యకర్తలు స్రవంతి, యశోద, తిప్పమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి బిల్లులు చెల్లించాలి



కూలీలతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు పార్వతీ ప్రసాద్

కూడేరు: ఉపాధి హామీ పథకం కింద పనులు చేసిన కూలీలకు వెంటనే బిల్లులు చెల్లించాలని ఎస్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు పార్వతీ ప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం కూడేరు, ముద్దలాపురం వద్ద ఉపాధి పనులను ఆమె పరిశీలించారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడారు. కూలీలు అడిగిన వెంటనే పని కల్పించాలని, పని ప్రదేశంలోనే నీడ, నీటి వసతి కల్పించాలని, పనిముట్లు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు మలరాయుడు, ఎస్ఎఫ్ఐడబ్ల్యూ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



ఆర్థిక సాయం అందిస్తున్న జీకే కృష్ణమూర్తి

కళ్యాణదుర్గం రూరల్: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన కుందిర్పి జెడ్పీటీసీ రాధాస్వామి బెంగళూరులో చికిత్స పొందుతున్నారు. కళ్యాణదుర్గం బడుగు బలహీన వర్గాల నేత బెస్తరపల్లి కృష్ణమూర్తి బెంగళూరు మణిపాల్ ఆసుపత్రికెళ్లి రాధాస్వామిని పరామర్శించారు. అనంతరం చికిత్స కోసం రూ.లక్ష ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో శెట్టూరు మండలం జడ్పీటీసీ అయ్యగార్లపల్లి మంజునాథ్, శ్రీ సన్నిధి రెన్యూబుల్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ సభ్యులు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు పాతర



కలుగోడు గ్రామం వద్ద రోడ్డుకిరువైపులా వేసిన మట్టి

గుమ్మఘట్ట: రోడ్డు నిర్మాణ పనుల్లో నిబంధనలకు పాతర వేశారు. మండలంలోని నేత్రపల్లి గ్రామం నుంచి బేలోడు, రంగచేడు, కలుగోడు వరకు 8 కిలో మీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి పీఎంజీఎస్‌వై పథకం కింద రూ.4.11 కోట్లు మంజూరు చేశారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా కలుగోడు చెరువు నుంచి భారీగా మట్టి తరలించారు. నేత్రపల్లి నుంచి రంగచేడు వరకు రోడ్డు పక్కనే ఉన్న మట్టిని గుంతలు తవ్వేశారు. ఈ విషయంపై పీఆర్ డీఈఈ సుధాకర్ నాయక్‌ను అడగ్గా కాంట్రాక్టర్ బిల్లు చెల్లింపులో సీనరేస్ చార్జీలు కట్ చేస్తామని తెలిపారు.

వైభవంగా బసవేశ్వరస్వామి ఆలయ ప్రారంభోత్సవం



మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డిని సన్మానిస్తున్న గ్రామపెద్దలు, ఆలయ అర్చకులు

ఉరవకొండ: విడపనకల్లు మండలం మల్లాపురంలో నూతన నిర్మించిన బసవేశ్వరస్వామి ఆలయ ప్రారంభోత్సవం శనివారం వైభవంగా జరిగింది. మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త వై.విశ్వేశ్వరరెడ్డి హాజరయ్యారు. ఉదయం అంకుర్పారణ, బ్రహ్మపూజ. నవగ్రహ పూజలు చేశారు. అనంతరం శివబసవేశ్వర, విఘ్నేశ్వర, పార్వతీదేవి, నాగదేవత శిలావిగ్రహాల గ్రామోత్సవం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వీరశైవ సమాఖ్య అధ్యక్షుడు దండిన శివానంద, పార్టీ నాయకులు ఎర్రిస్వామిరెడ్డి, శంకర్‌గౌడ్, వై.వన్నారెడ్డి, ఎ.వన్నారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మల్లికార్జున, ఈశ్వర్‌రెడ్డి, వెంకటేసులు, గోవిందరాజులు పాల్గొన్నారు.

పశుగ్రాసం సరఫరా చేయండి

కుందుర్పి: మండలంలో పశుగ్రాసం సరఫరా చేయాలని ఎంపీపీ నాగరాజు, వైస్ ఎంపీపీ భీమిరెడ్డి, మండల కన్వీనర్ హనుమంతరాయుడు, డివిజన్ మహిళా అధ్యక్షురాలు నాగలక్ష్మి, ఐటీ విభాగం జిల్లా కార్యదర్శి నరేష్ తదితరులు కోరారు. శనివారం వారు మాట్లాడుతూ మండలంలో గ్రాసం కొరత కారణంగా కణేకల్లు, బొమ్మనహాళ్, డీహీరేహాళ్ నుంచి ట్రాక్టర్ వరిగడ్డి రూ.12 వేలు, గ్రాసం వేరుశనగ కట్టె రూ.20 వేలు చెల్లించి కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్థిక స్తోమత లేని రైతులు పశువులను గుడిబండ, అనంతపురం మార్కెట్లకు తరలించి అందిన కాడికి అమ్ముకుంటున్నట్లు తెలిపారు.

వేసవి దుక్కులతోనే భూమికి సారం

కుందుర్పి: వేసవి దుక్కులతో భూమి సారవంతమై, పంటల దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని ఏఓ మహేష్, కుసుమగిరి రైతు సంఘం సీఈఓ నరసింహమూర్తి తదితరులు సూచించారు. శనివారం కుందుర్పి, మాయదార్లపల్లి, వడ్డేపాళ్యం తదితర గ్రామాల రైతులకు వేసవి దుక్కులు దున్నడం, సేంద్రియ ఎరువులు వాడకం, భూసార పరీక్షలు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు.

శుభకార్యం

ఉరవకొండ రూరల్: వెలిగొండకు చెందిన సర్పంచు వీరాంజనేయులు సోదరుడు కుబేర్, గురుపాదమ్మ దంపతుల కుమార్తె పవిత్ర, పవన్‌కుమార్ వివాహ రిసెప్షన్ శనివారం జరిగింది. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఎంపీపీ నరసింహులు, వైస్ ఎంపీపీ ఈడిగ ప్రసాద్, పార్టీ నాయకులు నాగప్ప, బసవరాజు, ఏసీ ఎర్రిస్వామి, వడ్డే ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంటకు నిప్పు



పంటనష్ట అంచనా పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

బెళుగుప్ప: మండల పరిధిలోని దుద్దేకుంటలో రైతు ప్రతాప్‌రెడ్డికి చెందిన మొక్కజొన్న పంటకు శనివారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో పంటతోపాటు డ్రిప్ పరికరాలు కాలిపోయాయి. కళ్యాణదుర్గం ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలు అదుపు చేశారు. అప్పటికే పంట కాలిపోవడంతో రూ.2 లక్షలు నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

వజ్రకరూరు: మండలంలోని పందికుంట తండాలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు కనెక్షన్ ఏర్పాటు చేశారు. శనివారం 'సాక్షి' లో 'జేఎల్ఎంపై చర్యలు తీసుకోవాలి' శీర్షికన వార్త ప్రచురితమైంది. ఉన్నతాధికారులు స్పందించి పందికుంటతండాలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు కనెక్షన్ ఇచ్చి, నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టారు. సర్పంచు ఉమామహేశ్వరి, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

ముమ్మరంగా ముంగారు సేద్యం పనులు



పి.నారాయణపురంలో పేడ ఎరువు తోలిన దృశ్యం

కూడేరు: ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే వర్షాలు కురుస్తున్నాయి. పి.నారాయణపురం, కరుట్లపల్లి, కూడేరు, ముద్దలాపురం, చోళసముద్రం, జయపురం, కొర్రకోడు, మరుట్ల, ఉదిరిపికొండ, కలగళ్ల, కమ్మూరు, అంతరగంగ, ఉదిరిపికొండ తండా, జల్లిపల్లితో పాటు మరికొన్ని గ్రామాల్లో ఇటీవల మోస్తరు వర్షాలు కురిశాయి. వేరుశనగ, కంది, ఆముదం, ఇతర పంటల సాగుకు నేలను సిద్ధం చేసేందుకు రైతులు దుక్కి పనులు ప్రారంభించారు. మండల వ్యాప్తంగా ఖరీఫ్‌లో వేరుశనగ పంట సుమారు 25 వేల ఎకరాలు, కంది 10 వేల ఎకరాలు, ఆముదం సుమారు 8 వేల ఎకరాల విస్తీర్ణంలో రైతులు సాగు చేస్తారు. నేలను సారవంతమయ్యేందుకు పాడి ఎరువును ఎద్దుల బండ్లు, ట్రాక్టర్ల ద్వారా రైతులు పొలాల్లో తోలుకుంటున్నారు. వ్యవసాయానికి కాడెద్దులు లేకపోవడంతో రైతులు ట్రాక్టర్‌తో గంటకు రూ.1,200 చెల్లించి నేలను దుక్కి చేయిస్తున్నారు.

పెన్నోబిలం బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం




శివరామిరెడ్డికి ఆహ్వానపత్రిక అందిస్తున్న ఈఓ రమేష్‌బాబు

ఉరవకొండ: పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలకు రావాలని ఎమ్మెల్సీ శివరామిరెడ్డికి ఆలయ ఈఓ సాకే రమేష్‌బాబు ఆహ్వానించారు. శనివారం ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డికి ఆలయ ఈఓ సాకే రమేష్‌బాబు ఆహ్వాన పత్రిక అందించారు. కొనకొండ్లలోని ఎమ్మెల్సీ స్వగృహంలో శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ శివరామిరెడ్డిని పెన్నోబిలం ఈఓ సత్కరించారు.

మురళీనాయక్ కుటుంబానికి అండగా నిలవాలి

వజ్రకరూరు: భారత్–పాకిస్తాన్ మధ్య జరుగుతున్న యుద్ధంలో ప్రాణాలర్పించిన వీరజవాన్ మురళీనాయక్ కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ ఎస్టీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు వడ్డియా గోవిందునాయక్ డిమాండ్ చేశారు. శనివారం వజ్రకరూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంకోసం ప్రాణాలు అర్పించిన మురళీనాయక్ ఆత్మకు శాంతి కలగాలన్నారు. ఆ కుటుంబానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అండగా నిలిచి, ఆదుకోవాలని కోరారు. మురళీనాయక్ కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ మురళీనాయక్ కుటుంబానికి అండగా నిలవాలని కోరారు.

బసాపురం ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు



అలంకరణలో బసాపురం ఆంజనేయస్వామి

కూడేరు: ప్రసిద్ధి గాంచిన బసాపురం ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలవిరాట్‌కు క్షీరాభిషేకం చేసి, పట్టు వస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఉంచి ఊరేగించారు. భక్తులకు అన్నదానం చేశారు.

నేమకల్లు అంజన్నకు పూజలు

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం ఆరు గంటలకు స్వామి బావి నుంచి పవిత్ర జలం తీసుకొచ్చి, అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక పుష్పాలంకరణ, కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ, ప్రత్యేక అలంకరణ చేసి, పూజలు చేశారు.

విప్రమలై క్షేత్రంలో పూజలు



విప్రమలై లక్ష్మీనరసింహ స్వామి మూలవిరాట్

రాయదుర్గంటౌన్: మల్లాపురం విప్రమలై క్షేత్రంలో వెలసిన లక్ష్మీ నవ నారసింహస్వామి జయంతి వేడుకలు ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు రామ్మూర్తి స్వామిజీ తెలిపారు. 11న ఉదయం స్వామికి లక్ష తులసి అర్చన, మహా నారాయణ ప్రధాన నారసింహ హోమం, పూర్ణాహుతి, మహామంగళ హారతి, సాయంత్రం 5 గంటలకు నరసింహస్వామి జయంత్యుత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. 12న 9 గంటలకు స్వామి వారి కల్యాణ మహోత్సవం ఉంటుందన్నారు.

సీతారామస్వామికి పూజలు



అలంకరణలో జనార్దన వేంకటేశ్వరస్వామి

వజ్రకరూరు: స్థానిక బలిజవీధిలో వెలసిన సీతారామస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం విశేష పూజలు జరిగాయి. స్వామికి అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని మొక్కులు తీర్చుకున్నారు. జనార్దన వేంకటేశ్వరస్వామి ఆలయంలోనూ పూజలు జరిగాయి.

అల్లుకున్న ప్రమాదం

ఉరవకొండ: మండలంలోని నెరిమెట్ల – మల్లాపురం రహదారిలో విద్యుత్ స్తంభాలకు చెట్ల తీగలు అల్లుకుని, ప్రమాదకరంగా మారాయి. నెరిమెట్లలలో ఇలాంటి విద్యుత్ స్తంభాలు ఐదుకు పైగా ఉన్నాయి. విద్యుత్ స్తంభాలకు చెట్ల తీగలు అల్లుకోవడంతో తరచూ మరమ్మతుకు గురవుతున్నాయి.



నెరిమెట్ల సమీపంలో విద్యుత్ స్తంభానికి అల్లుకున్న తీగలు

నిలువెత్తు నిర్లక్ష్యం



శనీశ్వరాలయం ఎదురుగా కూలేందుకు సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభం



రాయదుర్గం మార్కెట్‌యార్డు సమీపంలో వాలిన స్తంభం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కణేకల్లు రోడ్డు వెంబడి చాలా చోట్ల విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. కణేకల్లు రోడ్డులోని విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద నుంచి శనీశ్వరాలయం మిట్ట వరకు నాలుగైదు స్తంభాలు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. శనీశ్వరాలయం, మార్కెట్ యార్డు ఎదురుగా, ఎగ్జిబిషన్ ముందు విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయాయి.